# తీరనున్న వార సంత కష్టాలు


డొంకేశ్వర్ మండల కేంద్రంలో జరుగుతున్న వార సంత

- వసతుల కల్పనకు చర్యలు
- డొంకేశ్వర్ జీపీ తీర్మానం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ నూతన మండలంగా ఏర్పడిన తర్వాత వార సంత ఏర్పాటైంది. అయితే, మండల పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయిస్తున్నారు. కానీ, ప్రతి గురువారం జరిగే ఈ అంగడిలో కనీస సౌకర్యాలు త్రాగునీరు, టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, వ్యాపారులు పడుతున్న ఇబ్బందులు గ్రామ పంచాయతీ దృష్టికి రావడంతో వసతులు కల్పించడానికి చర్యలు చేపట్టారు. విక్రయదారులకే కాకుండా సంతకు వచ్చిన ప్రజలకు కూడా ఉపయోగపడే విధంగా పురుషులు, మహిళలకు వేర్వేరుగా 2 చొప్పున టాయిలెట్లు, బాత్‌రూంలను నిర్మించాలని పాలకవర్గం తీర్మానం చేసింది.

తాగునీటికి శాశ్వత నల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. వసతులు మెరుగైతే అంగడి మరింత విస్తరించే అవకాశముంది. త్వరలో భూమి పూజ కూడా చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది.

### వారంలోపు పనులు ప్రారంభిస్తాం



గ్రామ అభివృద్ధి ఎంత ముఖ్యమో వారసంతకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఇతర గ్రామాలు, ప్రాంతాల నుంచి వస్తున్న రైతులు, వ్యాపారుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లు, బాత్‌రూంలు నిర్మిస్తున్నాం. మంచి నీటి సౌకర్యం కూడా కల్పిస్తాం. వారంలోపు ఈ పనులు ప్రారంభిస్తాం.

– చాయ చందు, సర్పంచ్, డొంకేశ్వర్

# కడ్తా తీస్తే కఠిన చర్యలు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- పంచాయతీ బిల్లులు రావడం లేదని నందిపేట సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆగ్రహం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నందిపేట్(ఆర్మూర్): వరి ధాన్యానికి కడ్తా పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తప్పవని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హెచ్చరించారు. నందిపేటలోని రైతు వేదికలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైస్‌మిల్లర్లు కడ్తా తీస్తే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 10 వేల నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. మండలంలో పంటనష్టం సర్వే వ్యవసాయ శాఖ అధికారులు సరిగా చేయడం లేదని తన దృష్టికి వచ్చిందని అధికారులు రైతుల పక్షాన పనిచేయాలని ఏవో జ్యోత్స్న భవానిని హెచ్చరించారు.

**సర్పంచులను సముదాయించిన జెడ్పీ చైర్మన్**

గ్రామాభివృద్ధిలో భాగంగా తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని మండలంలోని సర్పంచులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సభను బహిష్కరిస్తామని ఆగ్రహం వ్యక్తం చేయడంతో జెడ్పీ చైర్మన్ కల్పించుకుని స్థానిక సంస్థల సమస్యలను పరిష్కరించే విధంగా తీర్మానం చేద్దామని సర్పంచులను సముదాయించారు.

**అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు**

నందిపేటతో పాటు ఇతర గ్రామాలలోని అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, కొందరు సర్పంచులు డబ్బులు తీసుకుని పర్మిషన్లు ఇస్తున్నారని ఎంపీటీసీ శ్రీనివాస్ అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జగ్గనాథ చారి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో నాగవర్ధన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### చందూర్ ఎత్తిపోతల పైప్‌లైన్ పనులు ప్రారంభం



రుద్రూర్: చందూర్ ఎత్తిపోతల పథకం పైప్ లైన్ నిర్మాణ పనులను సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వర్ని మండలంలో నాన్ కమాండ్ ప్రాంతానికి సాగు నీరు అందించడానికి సిద్దాపూర్ రిజర్వాయర్‌తో పాటు జాకోర, చందూర్, చింతకుంట ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నామని అన్నారు. జాకోర, చందూర్, చింతకుంట ఎత్తిపోతల పథకాలతో పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, సిద్దాపూర్ రిజర్వాయర్ ద్వారా మరో 15 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని పేర్కొన్నారు.

### జిల్లా సాధించే వరకు దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో పట్టణ కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం నాటికి 141వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాది అర్జున్‌రాండర్, గుమస్తా అమీర్ ఖాన్‌లు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు. ప్రత్యేక జిల్లా సాధించే వరకు దీక్షలను కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: అకాల వర్షాలతో రైతులు పంటలు నష్టపోయారని, ప్రభుత్వమే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు రైతు మహాధర్నా నిర్వహించి రైతు సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోకుండా అబ్‌కీబార్ ...కిసాన్ సర్కార్ అనే నినాదంలో ఇతర రాష్ట్రాల్లో కేసీఆర్ పర్యటించడం సరికాదన్నారు. ఎకరానికి రూ.50వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు.

# త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు


రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న బోధన్ ఆర్డీవో

రుద్రూర్: ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కోటగిరిలో రైస్ మిల్లులను, కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. లారీల ద్వారా కాంటా అయిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్‌లోడ్ చేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టద్దన్నారు. ఆయన వెంట బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ఉన్నారు.

# రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నవీపేట: రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసుకుని అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ నర్సింగ్‌రావ్‌లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. అసోసియేషన్‌కు ప్రతినిధిగా ఉన్న బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి రైస్‌మిల్లర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

**ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**

ఎడపల్లి(బోధన్): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఎడపల్లి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మార్వో ఆకుల శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ...రంగు మారిన, తడిసిన ధాన్యంను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

### భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఉచితంగా అందించాలి



కమ్మర్‌పల్లి/నందిపేట/మాక్లూర్/భీమ్‌గల్: భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతి పౌరుడికి ప్రభుత్వం ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ప్రకారమే దేశం నడుస్తోందని, అలాంటి పుస్తకం గురించి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం విఫలమై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## సమాచారం..

**నేడు తాగునీటి సరఫరా నిలిపివేత**

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ ద్వారా పట్టణ ప్రజలకు అందించే త్రాగునీటి సరఫరా అనివార్య కారణాల వల్ల మంగళవారం నిలిపి వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. తిరిగి బుధవారం త్రాగునీటి సరఫరా చేస్తామన్నారు.

## క్లుప్తంగా

### 'మాటకు కట్టుబడి ఉన్నా'

బోధన్: తడిసిన వరిధాన్యం తాను కొనుగోలు చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని ప్రతిగింజనూ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఎక్కడైనా కొనుగోలు చేయని ధాన్యం ఉంటే తన క్యాంప్ ఆఫీస్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్కు చెందిన బీజేపీ నేతలు రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. బోధన్ ఆర్డీవో ఆఫీసులో మంగళవారం నుంచి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సమస్యలున్న రైతులు 9491036896కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### మజ్దూర్ జోనల్ కమిటీ జనరల్ సెక్రటరీగా సంజీవయ్య

వేల్పూర్: జాన్కంపేట్ కు చెందిన తలారి సంజీవయ్య దక్షిణ మధ్య రైల్వే జోనల్ డివిజన్ కమిటీ సికింద్రాబాద్, విజయవాడ డివిజన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ గా సోమవారం నియమితులైనట్లు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం జంగం అశోక్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన అంతర్జాతీయ పారా ఒలింపిక్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా కూడా ప్రసిద్ధి చెందాడు.

### విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం స్థానిక దాతలు సురంగి చంద్రశేఖర్, లావణ్య దంపతులు రూ. 1.11లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బద్రి, చింత గణేశ్, చింత ప్రదీప్, పెంట కిషన్, జగదీష్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

### కల్లు బట్టీని తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 33వ వార్డులో నెంబర్-1 కల్లు బట్టీని తొలగించాలని సోమవారం గంగాచరణ్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో, ఎక్సైజ్ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. కల్లుబట్టీ వల్ల వార్డు ప్రజలు, పాఠశాల ముందు ఉండటంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ఆకతాయిలపై ఫిర్యాదు చేయాలి

పెర్కిట్/ఆర్మూర్‌టౌన్: మహిళలు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీ టీంను సంప్రదించాలని షీ టీం ఆర్మూర్ డివిజన్ ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. పెర్కిట్ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పోకిరీలు వేధిస్తే విద్యార్థినులు షీ టీంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే షీ టీం ఎలా పనిచేస్తుందో వివరించారు. అనంతరం షీ టీం సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ ధనవేణి, వైస్ ప్రిన్సిపల్ సుమలత, షీ టీం హెడ్‌కానిస్టేబుల్ సుమతి పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎఫ్ భూములపై నిషేధం ఎత్తేయాలి

బోధన్: నిజాంషుగర్ ఫ్యాక్టరీ సాగు భూములపై జిల్లా అధికార యంత్రాంగం విధించిన అప్రకటిత నిషేధాన్ని ఎత్తివేయాలని బీజేపీ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా పేదలకు ఎకరం చొప్పున వేల ఎకరాల సాగు భూములు కేటాయించిందని, ఈ భూములకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కు ఉన్నాయని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ లో స్లాట్ బుక్ అవుతున్నా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### ఇసుక అక్రమ రవాణాను నియంత్రించండి



బోధన్: ఖండ్గాం, సిద్ధాపూర్, బిక్నెల్లి శివారులోని మంజీర నదిలోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఇసుక మాఫియా ఆగడాలను నియంత్రించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్డీవో ఆఫీసులో, తహసీల్దార్ వరప్రసాద్‌కు మంజీర తీర గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నదిలోంచి ట్రాక్టర్ల ద్వారా పంటల పొలాల మధ్య నుంచి తరలించి ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసి, టిప్పర్లు, భారీ వాహనాల్లో దూరప్రాంతాలకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మద్యం మత్తులో డ్రైవర్లు ఇసుక లోడ్ వాహనాలను అతివేగంగా తీసుకెళ్తున్నందున ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారని తెలిపారు. గ్రామస్తులు నిలదీస్తే ఎదురు దాడికి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

# అభివృద్ధికి నిలువుటద్దం ఆర్మూర్

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి


కౌన్సిలర్లతో సమావేశం నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణం అభివృద్ధికి నిలువుటద్దమని స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లతో ఆర్మూర్ అభివృద్ధి పనులపై వార్డుల వారీగా ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా అభివృద్ధిలో ఆర్మూర్ పరుగులు పెడుతూ ప్రగతికి చిరునామాగా మారిందన్నారు. మన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు గడప గడపకూ వెళ్లి అభివృద్ధిపై ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను బాయి, ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, బీఆర్ఎస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

**ఆదివాసి నాయకపోడు భవనానికి నిధుల మంజూరు**

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో ఆదివాసి నాయకపోడు సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.25 లక్షల నిధులతో పాటు 500 గజాల స్థలాన్ని కేటాయించారు. అంకాపూర్‌లో నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడు సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదివాసి నాయకపోడు కులానికి చెందిన నిరుపేదలు ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. ఆదివాసి నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, ప్రధాన కార్యదర్శి నల్లూరు సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా భూమిని పరిశీలించిన అధికారులు

**ఫారెస్టు భూమిగా గుర్తింపు**

సాక్షి ఎఫెక్ట్..


విచారిస్తున్న తహసీల్దార్ శంకర్

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు ఒడ్డెర కాలనీలో వెయ్యి గజాల అసైన్డ్ భూమి ఆక్రమణకు సంబంధించి సాక్షి దినపత్రికలో 'కొన్నది గోరంత,... ఆక్రమణ కొండంత' అనే శీర్షికన సోమవారం వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ శంకర్, ఆర్ఐ షఫీ, ఇతర రెవిన్యూ సిబ్బందితో కలిసి కబ్జా భూమిని పరిశీలించారు. విచారణలో ఆ భూమి ఫారెస్టు భూమి అని తేలింది. ఫారెస్టు అధికారులను రప్పించి వారి సమక్షంలోనే రెండో సర్వే చేశారు. సంబంధిత పత్రాలను తహసీల్దార్ శంకర్, ఫారెస్టు అధికారికి అప్పగించారు. వెంటనే స్థలాన్ని తమ ఆధీనంలోనికి తీసుకుంటామని ఫారెస్టు అధికారి అశోక్ సాక్షితో చెప్పారు.

# కొనసాగుతున్న ఐకేపీ వీవోఏల సమ్మె

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం సమ్మె 15వ రోజుకు చేరింది. సమ్మెకు కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు, రుద్రూర్‌లో బీజేపీ నేతలు, నవీపేటలో సీపీఎం నేతలు, బాల్కొండ, భీమ్‌గల్‌లో గ్రామ సంఘాల సమాఖ్య సభ్యులు మద్దతు తెలిపారు. కాసేపు శిబిరంలో కూర్చున్నారు. వీవోఏల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, వారు సమ్మె కొనసాగిస్తుండటం వల్ల సమాఖ్యల పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్


మాక్లూర్‌లో సమ్మె చేస్తున్న వీవోఏలు


కమ్మర్‌పల్లి: సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు


ముప్కాల్‌లో .. సమాఖ్యల అధ్యక్షులు


రుద్రూర్‌లో మద్దతు తెలుపుతున్న బీజేపీ నేతలు


నవీపేటలో మాట్లాడుతున్న సీపీఎం నేత రమేశ్

# నల్లబాడ్జీలతో నిరసన


నందిపేటలో మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ కారోబార్లు, పారిశుధ్య సిబ్బంది చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం నాలుగవ రోజుకు చేరుకుంది. నందిపేట మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు.

**బాల్కొండలో..**

బాల్కొండ: కారోబార్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని బాల్కొండలో కారోబార్లు డిమాండ్ చేశారు. సమ్మెను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఉమ్మడి బాల్కొండ జీపీ కారోబార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**నవీపేటలో..**

నవీపేట: జీపీ కారోబార్‌లు చేస్తున్న నిరవధిక సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవో-60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

### న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలి



బోధన్‌రూరల్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని బోధన్ మండల జూనియర్ పంచాయితీ కార్యదర్శులు అన్నారు. తమ సమస్యల సాధనకు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె సోమవారం 11వ రోజుకు చేరుకుంది. జేపీఎస్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

# జోరుగా కొనసాగుతున్న పేకాట

- దృష్టి సారించని పోలీసులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి అన్నట్లుగా ఒక్కో మనిషి ఒక్కో వ్యసనం బారిన పడుతుంటారు. మరీ ముఖ్యంగా పేకాట మోజులో పడ్డారంటే జీవితాలు ఛిద్రం అవ్వాల్సిందే. సరదాకు ఆడుకునే పేకాట కొందరికి వ్యసనంలా మారుతోంది. భీమ్‌గల్ మండలంలో కొన్ని రోజులుగా పేకాట మూడు ముక్కలు, ఆరు రూకలుగా కొనసాగుతోంది.

భీమ్‌గల్: భీమ్‌గల్ పరిధిలో పేకాట జోరుగా సాగుతోంది. కూర్చున్న చోటనే డబ్బులు సులభంగా సంపాదించాలనే ఆశతో కొంతమంది జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అత్యాశకు పోయి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు.

**వ్యవసాయ క్షేత్రాలే అడ్డాలు...**

పల్లెల్లో జనావాసాలకు దూరంగా ఉండే మామిడి తోటలు, పంట పొలాలను వేదికగా చేసుకొని పేకాట రాయుళ్లు జూదం ఆడుతున్నారు. భీమ్‌గల్ పట్టణ శివారుతో పాటు పురాణి పేట్, బాబాపూర్, బాబానగర్, చేంగల్, బడా భీమ్‌గల్ వంటి పలు గ్రామాల్లో ప్రత్యేక స్థావరాలను ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా ఆడుతున్నారు. బాబానగర్ గ్రామంలోని గోదాము నుంచి కుప్కల్ వెళ్లే దారిలో అడ్డగుట్ట ప్రాంతంలో ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద పది రోజుల నుంచి నిత్యం పేకాట ఆడుతున్నారు.

**ప్రత్యేక టీమ్ ఏర్పాటు..**

పేకాట స్థావరాలకు ఇతరులు ఎవరైనా వస్తే ముందస్తుగా సమాచారం ఇవ్వడానికి పేకాట రాయుళ్లు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసుకుంటారు. రహస్యంగా ఏర్పాటు చేసుకున్న టీమ్‌లోని వ్యక్తులు, అనుమానంగా కనిపించే వ్యక్తులు గానీ, పోలీసులు గాని సంచరిస్తే వెంటనే నిర్వాహకులకు పేకాట రాయుళ్లకు సమాచారం అందిస్తారు.

**బానిసలవుతున్నారు..**

పేకాట కారణంగా పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు పేకాటకు బానిసలై ఆస్తులు అమ్ముకుంటున్నారు. కొందరు వ్యక్తులు కేవలం పేకాటనే వృత్తిలాగ ఎంచుకొని ఆడుతున్నారంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. పోలీసు అధికారులు దృష్టి సారించి పేకాట ప్రభావం తగ్గించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.